RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

కరీంనగర్ గురువారం 22.01.2026 సంపుటి : 03 సంచిక : 51 పేజీలు : 08 వెల: రూ.5

Karimnagar Thursday 22.01.2026 Volume: 03 Issue 51 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక

## 47 మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీ

మున్సిపల్ ఎన్నికల వేళ ప్రభుత్వం కీలక నిర్ణయం



హైదరాబాద్: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బదిలీలు చేపట్టింది. ఏకంగా 47 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే విధుల్లో చేరాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. ప్రభుత్వ ఆదేశాలను పాటించకపోతే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించింది. ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకు సొంత జిల్లాల్లో ఉన్నవారిని, అలాగే ఒకే చోట మూడేళ్లు దాటిన వారిని మార్చేసినట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# అవినీతి,అక్రమాలకు కేంద్రంగా సింగరేణి

అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరగాలి..బంగారుబాతులా కాంగ్రెస్ వాడుతోంది

టెండర్లు రద్దు చేయడమంటే సింగరేణికి అన్యాయం చేసినట్లే

రాజకీయ జోక్యంతో సమస్యల్లోకి సింగరేణి ..ఉద్యోగుల చెమట, రక్తాన్ని దోచుకుంటున్నారు..కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపాటు



4

తెలంగాణకు గుండెలాంటి సింగరేణి.. ఇప్పుడు అవినీతి, అక్రమాలకు కేంద్రంగా మారిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణిని బంగారుబాతులా కాంగ్రెస్ వాడుతోందన్నారు.

## బొగ్గు కుంభకోణంపై భగ్గు

గర్జించిన బీఆర్ఎస్, టీబీజీకేఎస్

సింగరేణివ్యాప్తంగా జీఎం కార్యాలయాల ఎదుట ధర్నాలు



సింగరేణిలో కాంగ్రెస్ అవినీతి చర్యలకు పాల్పడుతున్నదంటూ బీఆర్ఎస్, టీబీజీకేఎస్ చేపట్టిన ఆందోళనలతో దద్దరిల్లింది. సింగరేణి సంస్థను కొత్త కొత్త అక్రమాలతో దోచు కునేందుకు కాంగ్రెస్ పెద్దలు కుట్ర పన్నుతున్నారని, ఒరిస్సాలోని నైని బ్లాక్ గనులు సైట్ విజిటింగ్ సర్టిఫికెట్ ద్వారా దోచుకునేందుకు ఎత్తులు వేస్తున్నారని, కోల్ ఇండియాలో లేని ఈ విధానం సింగరేణిలో ఎందు కంటూ బుధవారం సింగరేణి వ్యాప్తంగా టీబీజీకేఎస్, బీఆర్ ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు.

# మున్సిపోల్స్‌కు సిద్ధం

# 27న షెడ్యూల్?

- మున్సిపల్ ఎన్నికలకు చకచకా ఏర్పాట్లు
- మున్సిపల్ కమిషనర్ల బదిలీ
- డివిజన్ల వారీగా ఫొటో ఓటరు జాబితా, బ్యాలెట్ బ్యాక్సుల సిద్ధం
- సిబ్బందికి శిక్షణ
- 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్ల పరిధిలో ఎన్నికల నిర్వహణ



రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం చకచకా ఏర్పాట్లు చేస్తున్నది. ఈ నెల 24 లేదా 27వ తేదీన ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ ఒకేసారి జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఎస్ఈసీ కమిషనర్ రాణికుముదిని రోజు రెండు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లతో నిర్వహిస్తున్న వీడియో కాన్ఫరెన్స్‌లు ఈ నెల 23వ తేదీతో ముగియనున్నాయి.


5

# నాపూర్‌లో అభిషేక్'

తొలి టీ20లో భారత్ ఘనవిజయం

అభిషేక్ సుడిగాలి ఇన్నింగ్స్

రింకూ మెరుపులు



నాగ్‌పూర్: స్వదేశంలో న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌ను కోల్పోయిన భారత జట్టు.. బుధవారం నుంచి ఆరంభమైన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను ఘనవిజయంతో ప్రారంభించింది. పరుగుల వరద పారిన మ్యాచ్‌లో టీమ్ఇండియాదే పైచేయి అయింది. ఇరుజట్ల మధ్య నాగ్‌పూర్ వేదికగా జరిగిన మొదటి టీ20లో సూర్య సేన.. 48 పరుగుల తేడాతో కివీస్‌ను చిత్తుచేసి సిరీస్‌లో 1-0 ఆధిక్యాన్ని సాధించింది. ఆతిథ్య జట్టు నిర్దేశించిన 239 పరుగుల రికార్డు ఛేదనలో న్యూజిలాండ్.. 20 ఓవర్లకు 190/7కే పరిమితమైంది. ఛేదనలో గ్లెన్ ఫిలిప్స్ (40 బంతుల్లో 78, 4 ఫోర్లు, 6 సిక్స్‌లు), మార్క్ చాప్‌మన్ (24 బంతుల్లో 39, 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) పోరాడారు. మ్యాచ్‌లో మొదట టాస్ ఓడి బ్యాటింగ్‌కు వచ్చిన టీమ్ఇండియా.. అభిషేక్ శర్మ (35 బంతుల్లో 84, 5 ఫోర్లు, 8 సిక్స్‌లు) వీర విహారా నికి తోడు ఆఖర్లో రింకూ సింగ్ (20 బంతుల్లో 44 నాటౌట్, 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులతో ఆ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 238 రన్స్ చేసింది. అభిషేక్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది. ఇరుజట్ల మధ్య రెండో టీ20 ఈనెల 23న రాయ్‌పూర్‌లో జరుగుతుంది.

## ప్రాజెక్టుల నిర్మాణాలు వేగవంతం చేయాలి

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్,జనవరి 21 : రాష్ట్రంలో ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్ అధికారులను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సచివాలయంలో బుధవారం ప్రాజెక్టుల వారీగా పనుల పురోగతిని సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల కొనసాగింపునకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. టన్నెల్ బోరింగ్ మెషిన్(టీబీఎం) శకలాలను పూర్తిగా తొలగించామని, ప్రస్తుతం రైలు ట్రాక్ మరమ్మతులు కొనసాగుతున్నాయని తెలిపారు. తుమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మాణానికి డీపీఆర్ తయారీ తుది దశకు చేరుకున్నదని వెల్లడించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల తనిఖీ నివేదికలు, పునరుద్ధరణ ప్రణాళికలను పుణె సెంట్రల్ వాటర్ ప వర్ రీసెర్చ్ స్టేషన్ సమర్పించిందని తెలిపారు.



ముగ్గురు సభ్యుల బృందం అధ్యయనం ప్రారంభించిందని తెలిపారు. డిజైన్లు నెలలో రూపొందించాలని చెప్పారు. ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులను సాధించేందుకు కృషిచేయాలని సూచించారు.

# రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో అశ్విత ప్రతిభ

**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 21:**

గత నెలలో ఇచ్చోడలో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్బాల్ పోటీలలో బెల్లంపల్లి నెంబర్ టు ఇంక్లైన్ జిల్లా పరిషత్ హై స్కూల్ లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని వద్ది అశ్విత అండర్ 17 విభాగంలో అత్యున్నత ప్రతిభ కనబరిచింది. ఈనెల 22న నిజామాబాద్ జిల్లాలోని కమ్మరపల్లిలో జరగనున్న రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు హై స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఎం. డి చాంద్ పాషా తెలిపారు. విద్యార్థిని అశ్వితను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి ప్రత్యేకంగా అభినందించారు.



# నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన పర్స రమేష్

**జనోదయ, మందమర్రి జనవరి 21:**



పట్టణ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్గా పర్స రమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన సీఐ శశిధర్ రెడ్డి బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో కరీంనగర్ ట్రాఫిక్ సిఐగా విధులు నిర్వహిస్తున్న రమేష్ను పట్టణ సీఐ గా బదిలీ చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పట్టణ సిఐ రమేష్ను సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన సీఐ రమేష్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. సర్కిల్ పరిధిలోని ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ఇదివరకు ఇక్కడ విధులు నిర్వహించిన శశిధర్ రెడ్డికి పోలీస్ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.

# బాధ్యతలు స్వీకరించిన నూతన ఎస్సై నరేష్

**జనోదయ, మందమర్రి జనవరి 21:**

పట్టణ నూతన ఎస్సైగా జి.నరేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన రాజశేఖర్ బదిలీపై కొటపల్లి పోలీస్ స్టేషన్కి వెళ్లగా భూపాలపల్లి ఎస్సైగా విధులు నిర్వహించిన నరేష్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై జి.నరేష్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని ,ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తానని అన్నారు. ఇదే సందర్భంగా అసాంఘిక చాట్కార్యాలకు పాల్పడే వారిపై,చట్టాన్ని ఉల్లంఘించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. నిషేధిత గుట్కా, గంజాయి విక్రయాలను అరికట్టడంతో పాటు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, ఈవ్ టీజింగ్ పాల్పడే వారిపట్ల కఠిన చర్యలు తీసుకుంటా మన్నారు. పట్టణ ప్రజలు పోలీస్ సహాయం కోసం డయల్ 100 నెంబర్కు ఫోన్ చేసి పోలీస్ సహాయాన్ని పొందాలని కోరారు.



# జైపూర్ ఎస్ఐగా రాజశేఖర్ బాధ్యతల స్వీకరణ

**జనోదయ, జైపూర్, జనవరి 21**



జైపూర్ పోలీస్ స్టేషన్ ఎస్సైగా రాజశేఖర్ బుధవారం బాధ్య తలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ శ్రీదర్ రామకృష్ణపూర్ పోలీస్ స్టేషన్కు బదిలీపై వెళ్ళారు.

# ఘనంగా బోనాల పండుగ

**జనోదయ, మందమర్రి జనవరి 21:**



సమ్మక్క సారలమ్మ జాతర ప్రాంగణంలో సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఏరియాలోని ఆర్కే1ఏ గని సమీపంలోని జాతర ప్రాంగణంలో బుధవారం బోనాల పండుగలో ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మ వార్లకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ తెలంగాణలో జరిగే అతిపెద్ద జాతర సమ్మక్క సారక్క జాతర అని అన్నారు. జాతరను ఏరియా లోని ఆర్కే 1ఎ గని వద్ద ఈ నెల 28 నుండి 31 వరకు జరిగే జాతరకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. సింగరేణి ఉద్యోగులు మేడారంకి వెళ్లి మొక్కులు చెల్లించుకోవడానికి వెళ్లేవారని, తద్వారా సింగరేణిలో గైర్హాజరు శాతం పెరిగేదని, దీనిని దృష్టిలో పెట్టుకొని సింగరేణి యాజమాన్యం మేడారం తరహాలో ఆర్కే1ఎ సమీపంలో జాతర నిర్వహించేందుకు తొలిసారిగా 1986 సం,,లో జాతర ప్రారంభించినట్లు వివరించారు. గత 40 సం,,గా ప్రతి రెండు సంవత్సరాలకి వచ్చే ఈ పండగని వైభవంగా



నిర్వహిస్తున్నామన్నారు. పట్టణంతో పాటు రామకృష్ణాపూర్, చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు, ఉద్యోగులు వేలాది మందిగా అమ్మవార్లను దర్శించుకుంటారన్నారు. భక్తుల సౌకర్యార్థం జాతర ప్రాంగణంలో అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించడం జరిగిందని, తాగునీరు, విద్యుత్ దీపాలు, రాత్రి ఉండాలనుకునే వారికోసం పోలీసు బందోబస్తు, సాంస్కృతిక కార్యక్రమాలు, అనుక్షణం సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను, ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పట్టణ పరిసర ప్రాంత ప్రజలు, ఉద్యోగులు, అమ్మ వారి దీవెనలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎసఎవతీటీచటు జిఎం జివిల్ ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, రామకృష్ణా పూర్ ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, కెకె ఓసిపి ప్రాజెక్టు ఆఫీసర్ మల్లయ్య, కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, ఎస్కే గ్రూప్ ఏజెంట్ ఖాదీర్, ఏరియా ఇంజనీర్ ఈడఎం బాలాజీ భగవతి జ, డీజీఎం పర్సనల్ అశోక్, డీజీఎం ఐఈడి కిరణ్ కుమార్, డీజీఎం ఎఫ్డఎ ఆర్వీఎస్ఆర్కె ప్రసాద్, సివిల్ ఎసఎవతీటీఎ శ్రీధర్, ఎన్విరాన్మెంటల్ అధికారి వెంకటే రెడ్డి, పర్చేస్ అధికారి బాబు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, డివై మేనేజర్ ఐటి రవి, ఏఐటీయూసీ యూనియన్ నాయకులు, ఏరియా సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



# బుగ్గ దేవాలయం హుండీ లెక్కింపు



**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 21:**

బెల్లంపల్లి మండలంలోని కన్నాల గ్రామపంచాయతీ పరిధిలో గల శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ రంగు రవి కిషన్ గౌడ్ ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ అధికారులు ఆలయ హుండీని లెక్కించారు. కార్తీక మాసం ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా రూ 40,881 హుండీ ఆదాయం చేకూరింది. ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా తాళ్ల గురిజాల ఎస్సై బండి రామకృష్ణ, ఏఎస్ఐ అలీ, బాబాజీలు పర్యవేక్షించారు. అదేవిధంగా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే జాతర వేలం పాటను నిర్వహించారు. వేలం పాటలో దోనేటి రాజమౌళి రూ 65 వేలతో టెంకాయ విక్రయాల హక్కును పొందారు. ప్రసాదం విక్రయాలు, టై బజార్, వాహనాల పార్కింగ్ కోసం వేలం పాట పాడేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో వాయిదా పడ్డాయి. ఈ కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు శ్రీరామ్ బట్ల వేణుగోపాల శాస్త్రి, సతీష్ శర్మ, కన్నాల సర్పంచ్ నాదరి మల్లమ్మ, ఉప సర్పంచ్ తోకల సూరమ్మ , మాజీ సర్పంచ్ మంద అనిత,ఎండోమెంట్ అధికారి జి .బాపిరెడ్డి, క్లర్క్ భాను, అటెండర్ మహేష్ గౌడ్, అన్నదాన ట్రస్ట్ సభ్యులు మాసాడి శ్రీరాములు, మురుకూరి బాలకృష్ణ పాల్గొన్నారు.

# బాలపల్లిలో సీసీ కెమెరాల ప్రారంభం

**నేరాల నియంత్రణకు దోహదం**

**ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**

**జనోదయ,జగిత్యాల ప్రతినిధి, జనవరి 21**



జగిత్యాల రూరల్ మండలం బాలపల్లి గ్రామంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. గ్రామాల్లో నేరాల నియంత్రణకు, ప్రజల భద్రతకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు.అనంతరం దాతలను శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాతల సహకారంతో రూ.2 లక్షల విలువైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామంలోకి వచ్చే కొత్త వ్యక్తుల రాకపోకలను పర్యవేక్షించి అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలకంగా ఉపయోగపడతాయన్నారు. కెమెరాల ఏర్పాటుతో పాటు నిర్వహణ కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు.గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనం, అంగన్వాడీ భవనాల నిర్మాణానికి ఇప్పటికే భూమిపూజ చేసినట్లు పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ భవనాల నిర్మాణానికి సరైన స్థలాన్ని గుర్తించి పనులు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి రవీందర్ రెడ్డి, బాల ముకుందం, సర్పంచ్ రెడ్డి రత్న, ఉప సర్పంచ్ గుంటి రవి, పోరండ్ల సర్పంచ్ నక్క హరీష్, ఉప సర్పంచ్ మల్లేశం గౌడ్, మాజీ ఉప సర్పంచ్ గంగారెడ్డి, నాయకులు పెద్దిరెడ్డి రవీందర్ రెడ్డి, కడ మహేష్, సత్యనారాయణ, కొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.



## కొండాపూర్‌లో ఘనంగా భక్త మార్కండేయ జయంతి



**జనోదయ, జగిత్యాల, మేడిపల్లి, జనవరి 21**

మేడిపల్లి మండల కేంద్రంలోని కొండాపూర్ గ్రామంలో మహర్షి భక్త మార్కండేయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగానికి, భక్త మార్కండేయ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని అభిషేకాలు నిర్వహించి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ శివభక్తితో మృత్యువును జయించిన చిరంజీవి భక్తుడు మార్కండేయుడని పేర్కొన్నారు. శుక్లపక్ష చతుర్థి తిథినాడు వచ్చిన జయంతి సందర్భంగా అన్నదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అనుమల్ల విలాస్, చేపూరి నాగరాజు, గోస్కి మధు, అనుమల్ల బుచ్చన్న, ఇట్టే గణేష్, కమలాకర్, శంకర్, కుందెన సత్యనారాయణ, మ్యాకల రాజేశం, కిషోర్, మాస్టర్ గణేష్, వద్లగట్ల గణేష్, బండారి మహేష్, వజ్రలింగం లక్ష్మిపతి తదితరులు పాల్గొన్నారు.

## నిష్పక్షపాతంగా ఎన్నికలు

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**



**జనోదయ : మంచిర్యాల**

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలు – 2026 శాంతియుతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా 163 బి ఎన్ ఎస్ ఎస్ ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిన తర్వాత ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్, పోలింగ్, లెక్కింపు వంటి కీలక కార్యక్రమాల సమయంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. చట్ట ప్రకారం పోలింగ్ ముగిసే సమయానికి నిర్ణయించిన 48 గంటల వ్యవధిలో నిబంధనలను ఉల్లంఘించే కార్యక్రమాలు, బహిరంగ సమావేశాలు నిషేధించడం జరిగిందని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి బహిరంగ సభ, ఊరేగింపు, ప్రసంగాలు, ప్రసార, ప్రచార సాధనాల ద్వారా ప్రచారం, ఓటర్లను ప్రభావితం చేసే కార్యక్రమాలను నిర్వహించడం నిషిద్ధమని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఆయుధాలు కలిగి ఉండడం, ప్రచార వాహనాలు, ప్రచారం చేయడం, 5 కంటే ఎక్కువ మంది కలిసి ఉండడం, ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయడం నిషేధించడం జరిగిందని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై భారత్ నాగరిక్ సురక్ష సంహిత చట్టంతో పాటు ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి




**- సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నేతల పిలుపు**

**జనోదయ, గోదావరిఖని, జనవరి 21:**

ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మె విజయవంతం కై నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గోదావరిఖని చౌరస్తాలో బుధవారం నిరసన సభ నిర్వహించడం జరిగింది. ఈ నిరసన ధర్నా కార్యక్రమానికి జి ఎల్ బి.కె. ఎస్ (ఐ ఎఫ్ టీ యు) రామగుండం రీజియన్ అధ్యక్షులు బి అశోక్ అధ్యక్షత జరుగగా, కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐ ఎఫ్ టీ యు. రాష్ట్ర అధ్యక్షులు ఐ కృష్ణ, టీ ఎస్ యు ఎస్. రాష్ట్ర అధ్యక్షులు కామెర గట్టయ్య, హెచ్ ఎం ఎస్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వెంకటేష్, ఎస్ జీ ఎల్ బి కె ఎస్. రాష్ట్ర అధ్యక్షులు జీ రాములు, టీ ఎన్ టీ యు సి.రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మకాయల ఏడుకొండలు, ఐ ఎఫ్ టీ యు రాష్ట్ర అధ్యక్షులు కే విశ్వనాథ్‌లు మాట్లాడుతూ ...కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడులను ఏప్రిల్ నుండి అమలు చేయబోతున్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే ఈ సమ్మెలో కార్మి కుల, రైతులు భాగస్వాములు కావాలని కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చా రు. సంఘటిత, అసంఘటిత కార్మికులు వీధుల్లోకి వచ్చి బలమైన ఉద్యమాలు నిర్మించాలన్నారు. లేదంటే బిజెపి ప్రభుత్వం మరింత కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందన్నారు. ఈ రాష్ట్రం లో సమ్మెను విఫలం చేసి ప్రయత్నం చేస్తుందని చెప్పారు. పోరాడి సాధించిన 8 గంటలను 10 గంటలు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఫిబ్రవరి 12 సమ్మెకు రాష్ట్రంలో ప్రధాన సంఘటిత రంగాలైన రవాణ రంగాలైన రైల్వే, బస్సు, ఆటో లను నిలుపుదల చేయలన్నారు. బ్యాంకు, ఇన్సూరెన్స్, అన్ని రంగాల కార్మికులు ముందుండి పోరాడితే తప్ప ఈ సమ్మె విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.ఈ నిరసన కార్యక్రమంలో సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు నీరటి రాజన్న, ఈ నరేష్, సమ్ము రాజయ్య, మాతంగి రాయమల్లు, ఈదునూరి రామకృష్ణ, జైపాల్ సింగ్, జనార్దన్, రత్న కుమార్, రాజనర్స్, ఐ రాజేశం, ఎం దుర్గయ్య, బేగ్, డి బుచ్చమ్మ, ప్రసాద్, శేఖర్, కిరణ్, క్రాంతి, రామ్ చందర్, విష్ణు, శ్రీకాంత్ వీరేందర్, రెడ్డి, భువనచంద్ర, నాగరాజు, రామస్వామి, కాంతయ్య, ఎం కొమరయ్య పులిపాక రమేష్, ఎడ్ల రవికుమార్, సదానందం మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ విధానాలతో సింగరేణి మనుగడకే ముప్పు



**సింగరేణి టెండర్లపై సిబిఐ దర్యాప్తు చేయాలి**

**కాంగ్రెస్ కబంధ హస్తాల నుండి సింగరేణిని కాపాడాలి**

**టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిరసన**

**జనోదయ, మందమర్రి జనవరి 21:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వలన సింగరేణి బొగ్గు పరిశ్రమ మనుగడకే ముప్పు వస్తుందని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) నాయకులు తెలిపారు. యూనియన్ అధినాయకత్వం పిలుపుమేరకు బుధవారం ఏరియాలోని అన్ని గనులు, విభాగాలపై టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి, అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సింగరేణి అధికారులకు అందజేశారు. ఏరియాలోని కేకే 5 గనిపై నిర్వహించిన కార్యక్రమానికి యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్ ముఖ్యఅతిథిగా హాజరై, ఆందోళనల కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా ఏరియాలోని కాసీపేట 2 గని పై యూనియన్ నాయకులు ప్రతాప్ సారంగపాణి, కారుకూరి తిరుపతిల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి, అనంతరం గని ఇంచార్జ్ మేనేజర్ రవిశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలకు ఉపాధినిస్తూ, రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముకగా నిలిచిన సింగరేణిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏటీఎంగా మార్చి వేసిందని ఎద్దేవా చేశారు. సింగరేణి ఉనికికే ప్రమాదాలు తీసుకువస్తూ, కాంగ్రెస్ పెద్దలు సింగరేణిని కొత్త కొత్త అక్రమాలతో దోచుకుంటున్నారని ఆరోపించారు. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మరో మంత్రి అనునయులకు టెండర్లు కట్టబెట్టేందుకు చేసిన కుట్రలు బహిర్గతమయ్యాయని, దీనికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నిర్వహించిన మీడియా సమావేశమే సాక్ష్యం అని తెలిపారు. ముఖ్యమంత్రి బంధువు కంపెనీకి, భట్టి విక్రమార్క అనుచ రులకు, మరో మంత్రి కంపెనీకి దక్కేలా సైట్ విజిటింగ్ సర్టిఫికెట్ అనే కొత్త విధానానికి తెరలేపారని ఆరోపించారు. ఒరిస్సాలోని నైనీ బ్లాక్ గనులు సైట్ విజిటింగ్ సర్టిఫికేట్ పేర కాంగ్రెస్ పెద్దలు సింగరేణిని దోచుకునేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. కోలిండియాలో ఎక్కడలేని విధంగా సైట్ విజిటింగ్ సర్టిఫికెట్ సింగరేణిలో ఎందుకని ప్రశ్నించారు. ఈ సర్టిఫికెట్ పేరుతో కాంట్రాక్టర్లను భయపెట్టి, మభ్యపెట్టి, రింగ్‌గా ఏర్పడి, సింగరేణిని దోచుకోవాలని కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. అదేవిధంగా గతంలో సింగరేణి యాజమాన్యం డీజిల్‌ను బల్కగా సరఫరా చేసేదని, ఇప్పుడు కాంట్రాక్టర్‌కు కేటాయించడంతో మరింత దోపిడీ చేస్తున్నారని, గతంలో మైనస్ 20 టెండర్ కోడ్ చేస్తే, కాంగ్రెస్ పెద్దల ప్లస్ 10 కి పెంచి, మరింత దోపిడీ చేస్తున్నారన్నారని ఆరోపించారు. సింగరేణిలో జరుగుతున్న దోపిడీపై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో సింగరేణి సంరక్షించబడిందని పునరుద్ఘటించారు. కాంగ్రెస్ వచ్చిన రెండేళ్లలో సింగరేణి మొత్తంగా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణిలో జరిగిన దోపిడీపై వెంటనే సిబిఐ దర్యాప్తు నిర్వహించాలని, దోపిడికి సంబంధం ఉన్న ప్రతి అధికారిని, కాంగ్రెస్ పెద్దలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కబంధ హస్తాల నుండి సింగరేణి కాపాడాలని, సింగరేణిలో మెడికల్ బోర్డు యధావిధిగా కొనసాగించి, కారుణ్య నియామ కాలు అమలుపరచాలన్నారు. సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు లాభాల వాటా, దీపావళి బోనస్‌లను ఎలాంటి షరతులు లేకుండా తక్షణమే చెల్లించాలని కోరారు. అదే విధంగా రాష్ట్రప్రభుత్వం నుండి సింగరేణికి రావాల్సిన 50 వేల కోట్ల రూపాయల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్ర మాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

# అవినీతి, అక్రమాలకు కేంద్రంగా సింగరేణి

**అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరగాలి**

**బంగారుబాతులా కాంగ్రెస్ వాడుతోంది**

**టెండర్లు రద్దు చేయడమంటే సింగరేణికి అన్యాయం చేసినట్లే**

**రాజకీయ జోక్యంతో సింగరేణిని సమస్యల్లోకి నెట్టివేశారు**

**సింగరేణి ఉద్యోగుల చెమట, రక్తాన్ని దోచుకుంటున్నారు**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్:** తెలంగాణకు గుండెలాంటి సింగరేణి.. ఇప్పుడు అవినీతి, అక్రమాలకు కేంద్రంగా మారిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణిని బంగారుబాతులా కాంగ్రెస్ వాడుతోందన్నారు. తెలంగాణ విద్యుత్ సంస్థలకు బొగ్గు అందించాలని.. కేంద్రం నైనీ కోల్ బ్లాక్‌ను కేటాయించిందని, కోల్ బ్లాక్‌కు కేంద్రం అన్ని అనుమతులు ఇచ్చిందని స్పష్టం చేశారు. అయితే, టెండర్లు పూర్తి చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నాన్చుతోందని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. టెండర్లు రద్దు చేయడమంటే సింగరేణికి అన్యాయం చేసినట్లేనన్నారు. సైట్ విజిట్‌కు.. సింగరేణి సర్టిఫికెట్ ఇవ్వాలనే నిబంధన పెట్టారని, అయితే సైట్ విజిట్ అనేది సెల్ఫ్ సర్టిఫికేషన్ నిబంధనని పేర్కొన్నారు. కానీ.. సింగరేణి సర్టిఫికెట్ ఇవ్వాలనే నిబంధన పెట్టడమేంటి అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. నచ్చిన వారికి నైనీ కోల్ బ్లాక్ ఇవ్వాలని చూస్తున్నారన్నారు. గతంలో బీఆర్ఎస్ ఇప్పుడు కాంగ్రెస్ సింగరేణిని వాడుకుంటున్నాయని, లాభాల బాటలో ఉన్న సింగరేణిని సమస్యల నిలయంగా మార్చారని కిషన్ రెడ్డి ఫైర్ అయ్యారు. నచ్చిన వారికి విజిట్ సర్టిఫికెట్లు ఇస్తున్నారని, సింగరేణిని రాజకీయ ప్రయోగశాలగా మార్చేశారని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. సింగరేణిలో కేంద్రం వాటా 49%.. కానీ పెత్తనం రాష్ట్రానిదని విమర్శలు గుప్పించారు. కేంద్ర ప్రభుత్వానికి ఏ రకమైన అధికారం లేదని, ఏడుగురు డైరెక్టర్లలో కేంద్రం నుంచి ఇద్దరే ఉంటారని తెలిపారు. సీఎండీ నియామకం కూడా రాష్ట ప్రభుత్వం చేతిలో ఉందన్నారు. కేసీఆర్ హయాంలో ఆడిందే ఆటగా కొనసాగిందని, రాజకీయ జోక్యంతో సింగరేణిని సమస్యల్లోకి నెట్టివేశారని ఆరోపించారు. సింగరేణి ఉద్యోగుల చెమట, రక్తాన్ని దోచుకుంటున్నారని అన్నారు. ఈ విషయంపై సీబీఐ విచారణ జరపాలంటున్నారని అయితే అందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి కూడా కావాలని తెలిపారు. ఈ వివాదంలోకి అనవసరంగా తనను లాగుతున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలోనూ అనేక అక్రమాలు జరిగాయని కిషన్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ , బీఆర్ఎస్ సింగరేణిని విధ్వంసం చేస్తున్నాయన్నారు. అక్రమ లావాదేవీలు, తెరవెనుక ఒప్పందాలు.. సింగరేణి భవిష్యత్‌ను ప్రమాదంలో పడేస్తున్నారని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. మంత్రుల మధ్య వాటాల వివాదంతోనే.. సింగరేణి వ్యవహారం వెలుగులోకి



వచ్చిందన్నారు. గతంలో తాడిచర్ల కోల్ బ్లాక్‌ను కేంద్రం జెన్‌కోకు కేటాయించిందని, మైనింగ్ చేస్తామని సింగరేణి ముందుకొస్తే బీఆర్ఎస్ బెదిరించిందన్నారు. తాము మైనింగ్ చేయబోమని బలవంతంగా లేఖ ఇప్పించిందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రైవేట్ సంస్థలకు వెళ్లేలా నాడు బీఆర్ఎస్ వ్యవహరించిందని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే పంథా కొనసాగిస్తోందని కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణిని పూర్తిగా ప్రక్షాళన చేయాలన్నారు. సింగరేణి అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు.

**రూ.47 వేలకోట్ల బకాయిలు ఎప్పుడిస్తారు?**

నైనీ కోల్ బ్లాక్ విషయంలోనే కాకుండా.. పూర్తిస్థాయి దర్యాప్తు జరగాలని కిషన్ రెడ్డి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకొస్తే సీబీఐ దర్యాప్తుపై కేంద్రం పరిశీలిస్తుందన్నారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం రూ.47 వేలకోట్ల బకాయిలు చెల్లించాలని, ఆ బకాయిలు ఎప్పుడిస్తారో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. సింగరేణి బొగ్గు క్వాలిటీ తగ్గిపోయిందన్నారు. సింగరేణి బొగ్గును చాలా రాష్ట్రాలు వద్దంటున్నాయని, సింగరేణి సంస్థ ఉనికే ప్రమాదకర స్థాయికి చేరిందన్నారు. సింగరేణి భూముల్లో అనేక ఆక్రమణలు జరుగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ముందుకొస్తే చర్యలకు కేంద్రం సిద్ధంగా ఉందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# మున్సిపోల్స్‌కు సిద్ధం

# 27న షెడ్యూల్?

- మున్సిపల్ ఎన్నికలకు చకచకా ఏర్పాట్లు
- మున్సిపల్ కమిషనర్ల బదిలీ
- డివిజన్ల వారీగా ఫొటో ఓటరు జాబితా, బ్యాలెట్ బ్యాక్సుల సిద్ధం
- సిబ్బందికి శిక్షణ
- 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్ల పరిధిలో ఎన్నికల నిర్వహణ



**రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం చకచకా ఏర్పాట్లు చేస్తున్నది. ఈ నెల 24 లేదా 27వ తేదీన ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ ఒకేసారి జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఎస్ఈసీ కమిషనర్ రాణికుముదిని రోజు రెండు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లతో నిర్వహిస్తున్న వీడియో కాన్ఫరెన్స్‌లు ఈ నెల 23వ తేదీతో ముగియనున్నాయి.**

**హైదరాబాద్, జనవరి 21 :** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం చకచకా ఏర్పాట్లు చేస్తున్నది. ఈ నెల 24 లేదా 27వ తేదీన ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ ఒకేసారి జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఎస్ఈసీ కమిషనర్ రాణికు ముదిని రోజు రెండు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లతో నిర్వహిస్తున్న వీడియో కాన్ఫరెన్స్‌లు ఈ నెల 23వ తేదీతో ముగియనున్నాయి. దీంతో 24న షెడ్యూల్ జారీచేస్తారని ప్రచారం జరిగింది. అదేరోజు షెడ్యూల్ జారీ చేస్తే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. ఎన్నికలు జరిగే నగరాలు, పట్టణాల్లో ఎలాంటి అధికారిక కార్యక్రమాలు నిర్వహించడానికి వీలుండదు. జనవరి 26న రిపబ్లిక్‌డే వేడుకల్లో సైతం మంత్రులు ప్రసంగించడానికి అవకాశం ఉండదు. దీంతో 27న ఒకేసారి షెడ్యూల్, నోటిఫికేషన్ జారీ చేయాలని ఎస్ఈసీ భావిస్తున్నట్లు సమాచారం. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఎస్ఈసీ సర్వం సిద్ధంచేసింది. బుధవారం జిల్లాల మున్సిపల్ కమిషనర్లను కూడా బదిలీ చేశారు. ఇప్పటికే డివిజన్ల వారీగా ఫొటో ఓటరు జాబితా, బ్యాలెట్ బ్యాక్సులను సిద్ధంచేశారు. మరోవైపు సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. ఇంకోవైపు రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్ల పరిధిలో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై ఎస్ఈసీ కమిషనర్ రాణికుముదిని వరుసగా జిల్లాల కలెక్టర్లతో సమీక్షలు నిర్వహిస్తున్నారు.

# సమ్మక్క సారమ్మలకు మొక్కులు చెల్లించిన మాజీ ఎమ్మెల్యే ఓదెలు

**జనోదయ, మందమర్రి జనవరి 21:** కోరిన కోరికలు తీర్చే వనదేవతలుగా ప్రఖ్యాతి చెందిన సమ్మక్క సారలమ్మకు తమ కోరికలు నెరవేరితే భక్తులు తమ నిలువెత్తు బంగారం (బెల్లం), మేకతో అమ్మవారిని కొలుచుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ నేపథ్యంలో బుధవారం పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో అమ్మవార్లకు చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు, ఆయన సతీమణి మాజీ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు నల్లాల ఓదెలు నిలువెత్తు బంగారాన్ని తులా భారం వేసి,



అనంతరం పట్టణంలోని ఆయన నివాసంలో అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా నల్లాల ఓదెలు మాట్లాడుతూ, కోరిన కోరికలు తీర్చే వన దేవతలు సమ్మక్క సారలమ్మ తల్లుల కృపకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆయన అమ్మవార్లను వేడుకున్నారు. ప్రజల ఆశీస్సులు, అమ్మ వార్ల కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ తమపై, తమ కుటుంబం పై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓదెలు కుటుంబ సభ్యులు, మిత్రులు, అనుచరులు, అభిమానులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి కేవీకేలో 9వ శాస్త్రీయ సలహా మండలి సమావేశం

**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 21:** బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం భారత వ్యవసాయ పరిశోధనా మండలి, అటారి జోన్ 10, ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో తొమ్మిదవ శాస్త్రీయ సలహా మండలి సమావేశాన్ని వ్యవసాయ శాస్త్రవేత్తలు నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం విజయాలు, కార్యాచరణ పై రైతులకు వివరించారు. రాబోయే సంవత్సరం చేపట్టే ప్రణాళికలు తెలియజేశారు. జిల్లాలో ప్రధాన సాగు సమస్యలు, రైతులకు అందుబాటులో ఉన్న పథకాలు, ప్రకృతి సాగు, చేపల పెంపకంపై వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ (ఆర్ ఏ ఆర్ ఎస్ పొలాస, జగిత్యాల) డాక్టర్ ఎస్. హరీష్ కుమార్



శర్మ, భారత వ్యవసాయ పరిశోధన మండలి సీనియర్ సైంటిస్ట్ డాక్టర్. ఏ ఆర్ రెడ్డి, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్. టి ఆర్ సాహు, ఈ ఈ ఐ ప్రొఫెసర్ డాక్టర్. పి. విజయలక్ష్మి, బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. ప్రసూన తో పాటు కెవికె విభాగాల శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు , రైతులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి నూతన కమిషనర్‌గా జె.సంపత్

**జనోదయ,బెల్లంపల్లి, జనవరి 21:** బెల్లంపల్లి మున్సిపల్ నూతన కమిషనర్‌గా జె. సంపత్‌ను నియమించారు. బెల్లంపల్లిలో పనిచేసిన తన్నీరు రమేష్‌ను ములుగు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. కాగా ములుగు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న జె సంపత్‌ను బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ సి డి ఎం ఏ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.గురువారం బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా జె. సంపత్ బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది.



# పరారీలో ఉన్న నిందితుని పట్టివేత

**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 21:** బెల్లంపల్లి టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పరారీలో ఉన్న రోషన్ అనే నిందితున్ని చాకచక్యంగా పట్టుకున్నట్లు బెల్లంపల్లి రూరల్ సీఐ సిహెచ్ హనూక్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడు రోషన్ పారిపోయాడు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని రైసన్ జిల్లా సాంచి పోలీస్ స్టేషన్ పరిధిలో గల నీగుల్ గాం గ్రామానికి బెల్లంపల్లి రూరల్ సీఐ హనూక్, టూ టౌన్ ఎస్సై చిలుముల కిరణ్ కుమార్, 6 గురు పోలీస్ సిబ్బంది వెళ్లారు. అక్కడి గ్రామస్తులు నిందితుడిని పోలీసులకు అప్పజెప్పకుండా దాడి చేశారు. స్థానిక



పోలీసుల సహాయంతో నిందితుడిని అరెస్టు చేసి జైలుకు పంపించారు. నిందితుడు రోషన్‌ను పట్టుకోవడంలో కృషి చేసిన బెల్లంపల్లి రూరల్ సీఐ హనూక్, బెల్లంపల్లి టూ టౌన్ ఎస్సై చిలుముల కిరణ్ కుమార్ , పోలీసు సిబ్బందిని రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డిసిపి ఎగ్గడి భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ ఏ. రవి కుమార్‌లు అభినందించారు.

# బెల్లంపల్లిలో జోరందుకున్న బెల్లం అమ్మకాలు

**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 21:** బెల్లంపల్లి పట్టణంలో బుధవారం బెల్లం అమ్మకాలు జోరందుకున్నాయి. ఈనెల 28, 29,30 లలో మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వెళ్లనుండడంతో ముందుగా బెల్లం (బంగారం) మొక్కులు తీర్చుకున్నారు. పల్లెలు, పట్నం తేడా



లేకుండా ఒకేరోజు ముందస్తు మొక్కులు చెల్లించుకోవడంతో బెల్లంపల్లి పాత బస్టాండ్ ప్రాంతం బెల్లం అమ్మ కాలతో రద్దీగా మారింది. భక్తుల నిలువెత్తు బెల్లం (బంగారం) మొక్కులతో జాతర సందడి కొట్టొచ్చినట్లు కనిపించింది.

# మళ్లీ సెల్ఫ్ డబ్బా



**195 దేశాల్లో తెలుగువాళ్లు ఉన్నారంటే దానికి కారణం నేనే..**

**గొప్పలు చెప్పుకున్న చంద్రబాబు**

**హైదరాబాద్ :** తెలుగువారి అభ్యున్నతికి తానే కారణమని, దేశ రాజకీయాల్లో తనను మించిన వారు లేరని, అభివృద్ధికి తానే ఆద్యుడిననే రీతిలో ప్రగల్భాలు పలుకుతూ నెటిజెన్ల చేతిలో నిత్యం ట్రోలింగ్‌కు గురయ్యే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తాజాగా తనదైన ట్రేడ్ మార్క్ సెల్ఫ్ డబ్బా మళ్లీ కొట్టుకున్నారు. ఈ సారి ఓ అడుగు ముందుకేసి తాను నాడు తెచ్చిన ఐటీ పాలసీ వల్లనే నేడు 195 దేశాల్లో తెలుగు వారు ఉన్నారని సెలవిచ్చారు.దావోస్ పర్యటనలో బాబు అక్కడి తెలుగు వారితో జరిగిన సమావేశంలో ఈ మేరకు డబ్బా కొట్టుకున్నారు. తాను నాడు తెచ్చిన ఒక పాలసీ, ఐటీని ప్రమోట్ చేయాలని తీసుకున్న నిర్ణయమే 195 దేశాల్లో తెలుగు వారు సెటిల్ కావడానికి కారణమని చెప్పుకొ చ్చారు. ఈ నెల లోనే ఆయన కోహినూర్ డైమం డ్‌ను తాను ఎక్కడ తీసుకెళ్లిపోతానో అనే భయంతో లండన్ పోలీసులు తనపై ఇంటెలి జెన్స్ నిఘా పెట్టారంటూ హాస్యాస్పద వ్యాఖ్యలు చేశారు.దేశ రాజకీయాల్లో తన కంటే సీనియర్ ఎవరూ లేరని కూడా చెప్పుకొచ్చారు. బాబు డాబు వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాలలో సెటైర్లు పేలుతున్నాయి. 'సెల్ఫ్ డబ్బా కొట్టుకోవ డంలో మీకు మీరే సాటి.. బాబు' అంటూ కా మెంట్లు పెడుతున్నారు. 'రాష్ట్రాల నుంచి వలస లు పెరుగుతున్నాయని, ఏ సీఎం కూడా చెప్పు కోరని.. మీ పనితనంతోనే ఉద్యోగాలు దొరక్క ఇతర దేశాలకు తరలివెళ్తున్నారు' అంటూ చురకలు అంటిస్తున్నారు. 'ముందు ఏపీని అభి వృద్ధి చేసి గొప్పలు చెప్పుకొవాలి' అని సలహా ఇస్తున్నారు. 'వయసు మీద పడటంతో బాబు ఇలా ప్రవర్తిస్తున్నారని, ఇది చాలా సీరియస్ ఇష్యూ' అంటూ మరికొందరు కామెంట్లు పెడుతున్నారు.

రెండు తెలుగు రాష్ట్రాల్లో అశేష పాఠకాదరణ పొందిన వాస్తవం డిజిటల్ పత్రిక ఆర్ఎన్ఐ అనుమతులున్న జనోదయ ప్రింట్ పత్రికలకు
రాజకీయ,
ఆర్థిక,సామాజిక,సాహిత్య
వ్యాసాలతోపాటు
ఇతర వార్తల కవరేజీ
సమాచారాన్ని పంపడానికి
ఆహ్వానం
8074124190
9618616110
జనోదయ
మానసాని కృష్ణా రెడ్డి
వాస్తవం,జనోదయ
తెలుగు దినపత్రికల
ప్రధాన సంపాదకులు
Manasani Krishna Reddy
వాస్తవం
రేవంత్‌కు వేమూరి డప్పు

# చలాన్లు కట్టాలని వాహనం కీ గుంజుకోవద్దు

## ట్రాఫిక్ పోలీసులకు హైకోర్టు కీలక ఆదేశాలు

**హైదరాబాద్ :** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులను ట్రాఫిక్ పోలీసులు బెదిరించరాదని హైకోర్టు తేల్చి చెప్పింది. ట్రాఫిక్ ఉల్లంఘనదారుల వాహనాల తాళాలు తీసుకోవడం, చలానా చెల్లించాలని ఒత్తిడి చేయడం వంటి చర్యలకు పాల్పడరాదని స్పష్టంచేసింది. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారికి చట్ట ప్రకారం నోటీసులు జారీ చేయాలని, విధించిన చలాన్ల మొత్తాన్ని చెల్లించని వారిని ప్రాసిక్యూట్ చేయాలని ట్రాఫిక్ పోలీసులకు ఆదేశాలు జారీచేసింది. చలాన్లను ఆన్‌లైన్ ద్వారా చెల్లించేవారికి ఆ అవకాశం ఇవ్వాలని పేరొంది. చలానా సొమ్ము చెల్లించని వారిపై ప్రాసి క్యూషన్ చర్యలు చేపట్టాలంది. విధుల్లో భాగంగా వాహనదారులను తనిఖీ చేయ డానికి ఈ ఆదేశాలు అడ్డంకి కావని వివరించింది. ట్రాఫిక్ రూల్స్ ఉల్లం ఘనలకు పాల్పడినవారికి జరిమానా విధించి, చలాన్‌లు వసూలు చేసే అధికారాన్ని రవాణా, పోలీసుశాఖ అధికా రులకు కల్పిస్తూ ప్రభుత్వం జారీచేసిన జీవో 108 అమలును నిలిపివేసేందుకు కోర్టు నిరాకరించింది. ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణిస్తున్నందుకు వాహన యజమానికి రూ.1200 జరిమానా విధింపునకు పోలీసులు, రవాణాశాఖకు అధికారం కల్పిస్తూ 2011లో ప్రభుత్వం ఇచ్చిన జీవో 108ని సవాలు చేస్తూ వీ రాఘవేంద్రాచారి వేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎన్వీ శ్రావణ్ కుమార్ మంగళవారం విచారణ జరిపారు. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పోలీసులు వాహనాలను ఆపి బెదిరించి చలాన్లు వసూలు చేస్తున్నారని చెప్పారు. మోటరు వాహన చట్టం-19 88లోని సెక్షన్ 200 కింద పోలీసులు, రవాణాశాఖ అధికారులు జరిమానా వసూలు చేసే అధికారం కల్పించే జీవోకు అనుగుణంగా నోటిఫికేషన్ వెలువడలేదని గుర్తుచేశారు. కాబట్టి ఆ జీవో అమలు చెల్లదని తెలిపారు. జీవో ప్రకారం పోలీసులకు చలాన్ల వసూలు చేసే అధికారం లేదని అన్నారు. దీనిపై ప్రభుత్వ న్యాయ వాది ప్రతివాదన చేస్తూ.. జీవోకు అనుగుణంగా నోటిఫై చేయలేదని ఒప్పుకున్నారు. సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేసేందుకు కొంత సమయం ఇవ్వాలని కోరారు. ఇరుపక్షాల వాదనలపై స్పందించిన హైకోర్టు.. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న




చలాన్లను బలవంతంగా వసూలు చేయరాదని ఆదేశించింది. ట్రాఫిక్ రూల్స్‌ను ఉల్లంఘించిన వారి వాహనాల తాళాలు తీసుకోవడం వంటి చర్యలకు పాల్పడవద్దని చెప్పింది. చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వాలని పేరొన్నది. విచారణను ఫిబ్రవరి 3కు వాయిదా వేసింది.

# దుర్భాష మాత్రమే నేరం కాదు

## ఎస్సీ/ఎస్టీ చట్టంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు



**న్యూఢిల్లీ:** కులం ఆధారంగా వ్యక్తిని అవమానించే ఉద్దేశం స్పష్టంగా ఉంటే తప్ప ఎస్సీ లేదా ఎస్టీకి చెందిన వ్యక్తిని దుర్భాషలాడినంత మాత్రాన స్వయంచాలకంగా ఎస్సీ/ఎస్టీ చట్టం కింద నేరంగా పరిగణించబడదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. బీహార్‌లోని అంగన్వాడీ కేంద్రం వద్ద షెడ్యూల్డ్ కులానికి చెందిన ఓ వ్యక్తిని దుర్భాషలాడారన్న ఆరోపణ లను ఎదుర్కొంటున్న కేశవ్‌మహతో అనే వ్యక్తిపై నమోదుచేసిన క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ని రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఈ కీలక తీర్పును వెలువరించింది. కులం ఆధారంగా ఫిర్యాదుదారుడిని మహతో దూషించినట్లు ఎఫ్ఐఆర్‌లో కాని చార్జిషీట్‌లో కాని పేర్కొనలేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఎస్సీ/ఎస్టీ చట్టానికి చెందిన సెక్షన్ 3(1)(ఆర్)ని సుప్రీంకోర్టు ఉటంకిస్తూ ఈ నిబంధన కింద ఓ వ్యక్తిని శిక్షించడానికి నిర్దిష్టమైన షరతులు రెండు ముఖ్యమని కోర్టు పేర్కొంది. మొదటగా ఫిర్యాదుదారుడు ఎస్సీ లేదా ఎస్టీ అయి ఉండాలని, రెండవది ఫిర్యాదుదారుడి కులం ఆధారంగా దూషించినట్లు లేదా అవమానించినట్లు నిర్దిష్టంగా ఉండాలని కోర్టు వివరించింది. ఒక నేరం నిరూపితం కావాలంటే బాధితుడు ఎస్సీ లేదా ఎస్టీకి చెందిన వాడు అనే కారణంతో నిందితుడు బాధితుడిని ఉద్దేశపూర్వకంగా అవమానించాడని లేదా బెదిరించాడని చూపించాల్సి ఉంటుందని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం పేర్కొన్నది.

# సింగరేణిలో కాంగ్రెస్ భారీ దోపిడీ

**తేలుకుట్టిన దొంగల్లా మంత్రులు.. ఒకో మంత్రి ఒకో దేశం పరార్**

**రేవంతే అసలు దోషి.. సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాల్సిందే : కేటీఆర్**

**ఆయన నోరు తెరిచి సమాధానం చెప్పాలె**

**కాంగ్రెస్, బీజేపీ రెండూ ఢిల్లీ పార్టీలే**

**సంచులు మోసేదొకరు.. చెప్పులు మోసేదొకరు**

**ఢిల్లీకి మూటలు మోసేటోళ్లు మనకు వద్దు**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్**




**హైదరాబాద్:** సింగరేణి చరిత్రలో ఎన్నడూ లేని స్థాయిలో భారీ దోపిడీ జరుగుతున్నదని, ఈ దోపిడీపై సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరిపించాల్సిందేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు డిమాండ్ చేశారు. సింగరేణి అంశమే కాంగ్రెస్ అసలు స్వరూపాన్ని బయటపెడుతున్నదని పేర్కొన్నారు. దీనిపై మొత్తం మంత్రులు తేలు కుట్టిన దొంగల్లా కనీసం మాట్లాడటం లేదని, ఒకో మంత్రి ఒకో దేశం పారిపోయారని ఎద్దేవా చేశారు. ఈ స్కామ్ యటపడగానే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, భట్టి విక్రమార ఒకరిని మించి ఒకరు నటించారని, వారి మాటలు మోసాలు స్కామ్‌ను దాచి ఉంచలేవని స్పష్టంచేశారు. తెలంగాణభవన్‌లో బుధవారం కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో స్కీములు మాయమై సాములు మాత్రమే మిగిలాయని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిలో 'సైట్ విజిట్ సర్టిఫికెట్ ' అనే కొత్త నిబంధన తీసుకొచ్చి టెండర్లను కట్టడి చేసిందని కేటీఆర్ విమర్శించారు. గతంలో దేశంలో ఎకడున్న కాంట్రాక్టర్ అయినా ఈ-టెండర్ ద్వారా పోటీ పడే అవకాశం ఉండగా, ఇప్పుడు తప్పనిసరిగా సైట్‌కు వచ్చి సర్టిఫికెట్ తీసుకోవాల్సిందేనని చెప్పి అవినీతికి తలుపులు తెరిచారని ఆరోపించారు. దీనిద్వారా ఎవరు టెండర్ వేయాలి, ఎవరు వేయకూడదో ముందే నిర్ణయించే వ్యవస్థ ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ కారణంగా మొదటి పెద్ద కాంట్రాక్ట్ ముఖ్యమంత్రి బావమరిది సృజన్‌రెడ్డి కంపెనీకే దకిందని, రూ.250 కోట్ల కాంట్రాక్ట్ అందుకున్నారని ఆరోపించారు.ఒడిశాలోని నైని కోల్‌బ్లాక్ వాటాల విషయంలో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి మధ్య విభేదాలు బయటపడ్డాయని, ఒకరిపై ఒకరు మీడియా ద్వారా ఆరోపణలు చేసుకున్నారని చెప్పారు.

# గనుల శాఖ మంత్రి నువ్వే కదా విచారణకు ఆదేశించు

**మహేశ్ కుమార్ గౌడ్**



'గనుల శాఖ మంత్రి నువ్వే కదా. సింగరేణి నైని కోల్‌బ్లాక్ టెండర్ల వ్యవహారంపై చర్చలకు రావాలని

కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి టీపీసీసీ మహేశ్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. ఈ మేరకు కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై బుధ వారం గాంధీభవన్‌లో మహేశ్ కుమార్ స్పందించారు. కిషన్ రెడ్డి వ్యాఖ్యలు ప్రతిపక్ష నేతల మాదిరిగా ఉన్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన వాటితో పాటు పదేండ్లలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

రెండు తెలుగు రాష్ట్రాల్లో అశేష పాఠకాదరణ పొందిన వాస్తవం డిజిటల్ పత్రిక ఆర్ఎన్ఐ అనుమతులున్న జనోదయ ప్రింట్ పత్రికలకు
రాజకీయ,
ఆర్థిక,సామాజిక,సాహిత్య
వ్యాసాలతోపాటు
ఇతర వార్తల కవరేజీ
సమాచారాన్ని పంపడానికి
ఆహ్వానం
8074124190
9618616110
జనోదయ
మానసాని కృష్ణా రెడ్డి
వాస్తవం,జనోదయ
తెలుగు దినపత్రికల
ప్రధాన సంపాదకులు
Manasani Krishna Reddy
వాస్తవం
రేవంత్‌కు వేమూరి డప్పు

# ఎవరీ సమ్మక్క–సారలమ్మ..? మేడారం సమ్మక్క–సారక్క మహాజాతర

**మేడారం సమ్మక్క–సారక్క మహాజాతర : గిరిజన ఆత్మగౌరవానికి నిలువెత్తు సాక్ష్యం**

తెలంగాణ అరణ్యగర్భంలో...
కాలాన్ని దాటి నిలిచిన ఒక విశ్వాసం.
అధికారాన్ని ఎదిరించిన ఒక తల్లి.
త్యాగానికి ప్రతీకగా నిలిచిన ఒక కూతురు.
వారి కథే— **మేడారం సమ్మక్క–సారక్క మహాజాతర.**

ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన పండుగగా గుర్తింపు పొందిన ఈ మహాజాతర, కేవలం ఆధ్యాత్మిక ఉత్సవం మాత్రమే కాదు. ఇది గిరిజన సమాజ చరిత్ర, వారి పోరాట స్మృతి, సాంస్కృతిక స్వాభిమాన ప్రకటన. కుంభమేళా తర్వాత భారతదేశంలో అత్యధిక జనసాంద్రతను చూసే ఉత్సవంగా మేడారం జాతర నిలవడం వెనుక— ఈ గాథలోని త్యాగాలే మూలం.

ఈ ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు నాలుగు రోజులపాటు ములుగు జిల్లా మేడారంలో ఈ మహాజాతర జరగనుంది. లక్షల కాదు... కోట్లాది మంది భక్తులు వనదేవతలను దర్శించుకునేందుకు తరలిరానున్నారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వం వేలాది ప్రత్యేక బస్సులు, తాగునీరు, వైద్య శిబిరాలు, పారిశుద్ధ్యం, భద్రతా ఏర్పాట్లతో మేడారం అరణ్యాన్ని మరోసారి మహానగరంగా మలుస్తోంది. అయితే, ఈ ఏర్పాట్లకంటే గొప్పది— భక్తుల హృదయాల్లో కొలువై ఉన్న సమ్మక్క-సారక్కల త్యాగ చరిత్ర.




**అరణ్యంలో ఆవిర్భవించిన దేవత**

సుమారు ఏడువందల సంవత్సరాల క్రితం... కాకతీయుల పాలన సాగుతున్న కాలం. తెలంగాణ ప్రాంతం రాజకీయంగా, సాంస్కృతికంగా కీలక మార్పుల దశలో ఉంది. అదే సమయంలో, నేటి జగిత్యాల ప్రాంతానికి చెందిన కోయ గిరిజనుల దొర మేడరాజు అడవిలో వేటాడుతుండగా ఓ అద్భుత సంఘటన చోటుచేసుకుంది.

ఒక పుట్టపై— పులులు, సింహాలు కాపలాగా నిలిచిన— ఓ పసిబిడ్డ. సాధారణంగా అడవి జంతువులు పసిబిడ్డకు హాని చేస్తాయి. కానీ అక్కడ ప్రకృతి వేరే సంకేతం ఇచ్చింది. ఆ బిడ్డను చూసిన మేడరాజు... ఇది సామాన్య శిశువు కాదని గ్రహించాడు. ఆమెనే ఇంటికి తీసుకెళ్లాడు. ఆ బాలికే— సమ్మక్క.

సమ్మక్క ఇంట్లో అడుగుపెట్టిన నాటి నుంచే ఆ ప్రాంతంలో మార్పులు మొదలయ్యాయని గిరిజనుల నమ్మకం. కరువులు తగ్గాయి. పంటలు పండాయి. రోగాలు నయమయ్యాయి. ఆమె చేతి పసరుతో బాధలు తొలగేవని ప్రజలు విశ్వసించారు. అలా సమ్మక్క మానవ స్థితి నుంచి— ప్రకృతి శక్తిగా, వనదేవతగా మారింది.

**రాజ్యాధికారం... కుటుంబ బంధం**

కాలక్రమేణా సమ్మక్క యుక్తవయస్సుకు చేరుకుంది. మేడరాజు తన మేనల్లుడు, మేడారం ప్రాంతాన్ని పాలిస్తున్న పగిడిద్ద రాజుతో ఆమెకు వివాహం జరిపించాడు. ఈ వివాహం రాజకీయ బంధాన్ని కూడా బలపరిచింది.

సమ్మక్క-పగిడిద్ద రాజులకు సారలమ్మ, నాగులమ్మ అనే ఇద్దరు కుమార్తెలు, జంపన్న అనే కుమారుడు జన్మించారు. పగిడిద్ద రాజు మేడారం పాలకుడిగా, మేడరాజు పొలవాస ప్రాంతానికి కోయ రాజుగా పరిపాలన సాగించారు.

ఈ కాలంలో కాకతీయ సామ్రాజ్యం తన సరిహద్దులను విస్తరించాలనే లక్ష్యంతో దక్షిణ తెలంగాణపై దృష్టి సారించింది. చిన్న రాజ్యాలపై ఆధిపత్యం సాధించేందుకు కప్పం విధించడం ప్రారంభించింది.

**కాకతీయుల ఆగ్రహం... యుద్ధ మేఘాలు**

పగిడిద్ద రాజు కాకతీయుల సామంతుడిగా ఉండి ప్రతి నెలా కప్పం కట్టేవాడు. అయితే వరుసగా మూడు సంవత్సరాల పాటు కరువులు ఏర్పడ్డాయి. ప్రజలు ఆకలితో అలమటించారు. అటువంటి పరిస్థితుల్లో కప్పం చెల్లించడం సాధ్యపడలేదు.

అదే సమయంలో, కాకతీయుల దండయాత్ర భయంతో మేడరాజు తన కుమార్తె సమ్మక్క వద్ద మేడారంలో ఆశ్రయం పొందాడు. ఇది కాకతీయులకు ఆగ్రహాన్ని తెప్పించింది. కప్పం చెల్లించకపోవడం, శత్రువుకు ఆశ్రయం ఇవ్వడం— ఇవి రెండూ యుద్ధానికి కారణాలయ్యాయి.

వేలాది సైన్యం, ఏనుగులు, గుర్రాలు, ఆధునిక ఆయుధాలతో కాకతీయులు మేడారంపై దండెత్తారు.

**గిరిజన ప్రతిఘటన... అసమాన పోరు**

కాకతీయ సైన్యాన్ని ఎదుర్కొనేంత బలం కోయ గిరిజనులకు లేదు. అయినా వెనకడుగు వేయలేదు.

బాణాలు, మొండి కత్తులు, తక్కువ సంఖ్య— ఇవన్నీ తెలిసినా, గౌరవం కోసం పోరాడటంనే వారు ఎంచుకున్నారు. పగిడిద్ద రాజు ముందుండి యుద్ధం చేశాడు. సమ్మక్క, సారక్కలు కూడా ఆయుధాలు పట్టారు. యావత్ గిరిజన సమాజం ఈ పోరులో భాగమైంది.

ఈ అసమాన యుద్ధంలో— పగిడిద్ద రాజు వీరమరణం పొందాడు. సారలమ్మ, నాగులమ్మ శత్రువుల చేతిలో ప్రాణాలు కోల్పోయారు. కుటుంబ సభ్యుల మరణాన్ని చూసిన జంపన్న... అవమానాన్ని, వేదనను భరించలేక పక్కనే ఉన్న సంపెంగ వాగులో దూకి ఆత్మత్యాగం చేశాడు. అప్పటి నుంచి ఆ వాగు జంపన్న వాగుగా చరిత్రలో నిలిచింది.

**కాళీమాతలా విరుచుకుపడిన సమ్మక్క**

తన భర్త, పిల్లలు, కుటుంబ సభ్యులంతా మరణించారని తెలిసినా— సమ్మక్క వెనకడుగు వేయలేదు. ఆమె ఆ క్షణంలో మానవిగా కాదు... కాళీమాత స్వరూపంగా మారింది. శత్రువులపై విరుచుకుపడింది. అనేక మందిని సంహరించింది. కానీ వెనుక నుంచి జరిగిన దొంగచాటు దాడిలో ఒక సైనికుడు ఆమెను తీవ్రంగా గాయపరిచాడు.

రక్తం కారుతుండగానే సమ్మక్క అడవిలోకి వెళ్లింది. చిలుకల గుట్ట చేరుకుంది. నెమలినార చెట్టు కింద ఉన్న పుట్ట వద్ద— ఆమె కుంకుమ భరిణెగా మారి అదృశ్యమైంది.

అదే ఆమె భౌతిక అవతారానికి ముగింపు.

అదే ఆమె దైవ స్వరూపానికి ఆరంభం.

**ఆకాశవాణి... జాతర ఆరంభ గాథ**

సమ్మక్క అదృశ్యమైన తర్వాత గిరిజనులకు ఒక దివ్య సంకేతం వినిపించిందని కథనం.

"ఈ గడ్డపై రెండు గద్దెలు కట్టి, రెండేళ్లకొకసారి నన్ను పూజిస్తే— మీ కష్టాలు తొలగిస్తాను. మీ రాజ్యం గౌరవంగా నిలుస్తుంది" అనే ఆదేశమే అది.

ఈ విషయం కాకతీయ రాజు ప్రతాపరుద్రుడికి చేరింది. సమ్మక్క త్యాగాన్ని తెలుసుకున్న ప్రతాపరుద్రుడు ఆమె భక్తుడిగా మారాడు. గిరిజనులపై విధించిన కప్పాన్ని రద్దు చేశాడు. సమ్మక్క వెలిసిన చోట రెండు గద్దెలు నిర్మించి, ప్రతి రెండేళ్లకొకసారి జాతర నిర్వహించాలని ఆదేశించాడు.

అలా మేడారం జాతర— ప్రజా విశ్వాసం నుంచి రాజచిహ్నంగా మారింది.

**జాతర సంప్రదాయాలు... జీవంత ఆచారాలు**

మాఘ శుద్ధ పౌర్ణమి నాడు ప్రారంభమయ్యే మేడారం జాతర నాలుగు రోజులపాటు సాగుతుంది. ప్రతి రోజుకు ఒక ప్రత్యేకత ఉంది.

**మొదటి రోజు**

కన్నెపల్లి నుంచి సారలమ్మ గద్దెకు తీసుకొస్తారు. ఈ ప్రయాణం అంతా డోలు, పూనకాల మధ్య జరుగుతుంది.

**రెండో రోజు**

చిలుకల గుట్ట నుంచి సమ్మక్క కుంకుమ భరిణె రూపంలో గద్దెకు వస్తుంది. ఈ సమయంలో భక్తులు పూనకాలతో ఊగిపోతారు. ఇది జాతరలో అత్యంత కీలక ఘట్టం.

**మూడో రోజు**

సమ్మక్క-సారక్కలు ఇద్దరూ గద్దెలపై కొలువుతీరి భక్తులకు దర్శనమిస్తారు. ఈ రోజు అత్యధిక జనసాంద్రత కనిపిస్తుంది.

**నాలుగో రోజు**

అమ్మవార్లకు ఆవాహన పలికి— తిరిగి వనప్రవేశం చేయిస్తారు.

ఈ పూజలన్నింటినీ వంశపారంపర్యంగా గిరిజన పూజారులే నిర్వహిస్తారు. ఎలాంటి ఆగమ శాస్త్ర బంధనలు లేవు. ఇది పూర్తిగా గిరిజన సంప్రదాయం.

**బెల్లం... బంగారం ప్రతీక**

మేడారం జాతరలో అమ్మవార్లకు బెల్లం సమర్పించడం ప్రత్యేక ఆచారం. గిరిజనుల దృష్టిలో బెల్లం— బంగారంతో సమానం. శుద్ధి, మాధుర్యం, ఐశ్వర్యానికి ప్రతీక.

కోట్ల రూపాయల విలువైన బెల్లం ప్రతి జాతరలో సమర్పించబడుతుంది. ఇది భక్తుల విశ్వాసానికి నిలువెత్తు సాక్ష్యం.

**భారతదేశ ఆధ్యాత్మిక పటంలో మేడారం**


నేడు మేడారం జాతర— తెలంగాణకే కాదు, భారతదేశానికే గర్వకారణం.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌తో పాటు దేశం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారు. విదేశాల్లో నివసించే తెలుగు ప్రజలు సైతం ఈ జాతర కోసం ప్రత్యేకంగా వస్తారు.

అరణ్యంలో పుట్టిన ఈ జాతర—
ఈనాడు ప్రపంచానికి గిరిజన సంస్కృతి గొప్పతనాన్ని చాటుతోంది.

**మేడారం: ఒక ఉత్సవం కాదు... ఒక ఉద్యమం**

మేడారం జాతర—
ఒక పండుగ కాదు.
ఒక దేవాలయం కాదు.
అది—
**అన్యాయానికి ఎదిరిన పోరాట చరిత్ర.**
**త్యాగానికి నిలువెత్తు సాక్ష్యం**
**గిరిజన ఆత్మగౌరవానికి జీవంత ప్రతీక.**
అందుకే,
సమ్మక్క-సారక్కలు దేవతలే కాదు...
**వారు చరిత్రలో నిలిచిన విప్లవ స్వరూపాలు...**



సేకరణ :
హరి బాబు శర్మ
(సామవేద పండితులు, కరీంనగర్ )

---

## మార్కండేయ జయంతి: కరీంనగర్ వీధుల్లో మగ్గం రథోత్సవ వైభవం

**జనోదయ, కరీంనగర్ జనవరి 22:**

మార్కండేయ జయంతి సందర్భంగా కరీంనగర్ నగరంలో పద్మశాలి సంఘం 13వ డివిజన్ అధ్యక్షుడు తెల్ల రమేశ్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంప్రదాయానికి ప్రతీకగా మగ్గంతో అలంకరించిన రథాన్ని నగర వీధుల గుండా వైభవంగా ఊరేగించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘ సభ్యులు, మహిళలు, యువత భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. అనంతరం మార్కండేయ జయంతిని పురస్కరించుకుని భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచారు.

ఈ సందర్భంగా వక్తలు మహర్షి మార్కండేయుని గొప్పదనాన్ని వివరించారు. బాల్యం నుంచే శివభక్తితో తపస్సు చేసిన మార్కండేయుడు మృత్యువును జయించిన మహానుభావుడిగా పురాణాల్లో ప్రసిద్ధి చెందారని తెలిపారు. ధర్మం, భక్తి, ఆత్మశుద్ధి మార్గంలో నడవాలని ఆయన జీవితం మనకు బోధిస్తుందన్నారు. మార్కండేయ మహర్షి వంశీయులైన పద్మశాలీలు మగ్గాన్ని జీవనాధారంగా చేసుకుని భారతీయ వస్త్ర సంస్కృతికి ప్రాణం పోసిన వారని వక్తలు పేర్కొన్నారు. శ్రమ, నైపుణ్యం, సంప్రదాయాలను తరతరాలకు అందిస్తున్న పద్మశాలీల సేవలు సమాజానికి ఆదర్శమని తెలిపారు.





---

## మేడారం జాతరలో 'AI' బందోబస్తు

**జనోదయ, మేడారం జనవరి 22:**

మేడారం మహా జాతరలో AI సాంకేతికతతో బందోబస్తు నిర్వహిస్తున్నారు తెలంగాణ పోలీసులు. ఈనెల 28 నుంచి 31 వరకు జరగనున్న మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరలో AI సాంకేతికతతో బందోబస్తు నిర్వహిస్తున్నారు తెలంగాణ పోలీసులు. 3 రోజులపాటు జరగనున్న ఆసియాలోనే ఈ అతి పెద్ద ఆదివాసీ జాతరకు సుమారు 2 నుంచి 3 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ పర్యవేక్షణలో క్రౌడ్ కంట్రోల్, ట్రాఫిక్ మేనేజ్మెంట్, తప్పిపోయిన వారిని గుర్తించడం, నేరాలను అడ్డుకోవడం కోసం 'మేడారం 2.0' పేరుతో హైటెక్ భద్రతా వ్యవస్థను అమలు చేస్తున్నారు. ఇందులో 'TGQUEST' అనే AI డ్రోన్ వ్యవస్థ ప్రధానంగా ఉపయోగిస్తున్నారు.

ఈ డ్రోన్లు అటవీ ప్రాంతాలు, జంపన్నవాగు స్నాన ఘట్టాలు, ఆలయ ప్రాంగణాలు, రహదారులను గగనతలం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తాయి. జనసమూహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను AI ద్వారా ముందుగానే గుర్తించి ప్రమాదం ఉంటే అలర్ట్ ఇస్తాయి. అలాగే హీలియం బెలూన్‌లపై అమర్చిన PTZ కెమెరాలు, 450కు పైగా CCTV కెమెరాల ద్వారా కంట్రోల్ రూమ్ నుంచి ప్రత్యక్ష నిఘా కొనసాగుతుంది. జాతర నిర్వహణకు సుమారు 13,000 మంది పోలీసు సిబ్బంది, 12 ప్రత్యేక క్రైం టీమ్‌లు విధుల్లో ఉండనున్నారు. అటవీ ప్రాంతంలో ఇరుకైన రోడ్లు పైగా భారీ జనసమూహం వల్ల వచ్చే సమస్యలను ముందే అంచనా వేసేందుకు ఈ AI టెక్నాలజీ ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డితోసహా మంత్రులు ఎప్పటికప్పుడు స్వయంగా ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు. భక్తులు త్వరగా దర్శనం చేసుకుని సురక్షితంగా తిరిగి వెళ్లేలా ప్రభుత్వం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది.

